ప్రజాశక్తి

సోమవారం 7 అక్టోబర్ 2024 5

శ్రీ సత్యసాయి

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ మాజీ రాష్ట్ర నాయకులు రాంభూపాల్

చంద్రబాబు పాలన మోసపూరితం

ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర మాజీ నాయకులు రాంభూపాల్

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

మోసపూరిత హామీలతో చంద్రబాబు పాలన సాగుతోందని ఎస్‌ఎఫ్‌ఐ మాజీ రాష్ట్ర నాయకులు రాంభూపాల్ విమర్శించారు. అనంతపురం నగరంలోని అంబేద్కర్ భవన్ లో రెండవ రోజు ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్రస్థాయి సమావేశాలు జరిగాయి ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎస్‌ఎఫ్‌ఐ మాజీ రాష్ట్ర నాయకులు రాంభూపాల్ హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు అధికారంలో రాకముందు అనేక హామీలు ఇచ్చారన్నారు. నారా లోకేష్ యువగళం పాదయాత్ర సందర్భంగా అమ్మ ఒడి పేరు మారుస్తూ తల్లికి వందనం పేరుతో తాము అధికారంలోకి వస్తే ప్రతి ఇంటిలో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి 15వేల రూపాయల ప్రకారం ఇస్తామని హామీ ఇచ్చారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలు మరిచిపోయి రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. ఇచ్చిన హామీలు గురించికాని, విద్యగురించి మాట్లాడడం లేదన్నారు. ఇప్పటికే ప్రభుత్వ విద్య రోజురోజుకూ నిర్వీర్యం అవుతోందని అన్నారు. విద్యావ్యవస్థను బలపర్చాలంటే అందరూ కలిసి ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ అదేవిధంగా మెడికల్ విద్య పట్ల రాష్ట్ర ప్రభుత్వ వైఖరి విడ్డూరంగా ఉందన్నారు. తాము మెడికల్ నిర్వహించలేమని ఎన్ఎంసికు చంద్రబాబు గారు లేఖ రాయడం వలన 7వందల సీట్లు రాష్ట్రం నష్టపోయిందన్నారు. అదే విధంగా మరో 11 కళాశాల నిర్మాణం ఆపాలని ప్రభుత్వం కాంట్రాక్టర్లకు ఆదేశాలు చేయడాన్ని బట్టి చూస్తే పేద మధ్య తరగతి విద్యార్థులకు వైద్యం విద్యకు దూరం చేయడం తప్ప మరొకటి కాదని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి సంవత్సరం లక్ష మంది విద్యార్థులు లక్షల రూపాయలు ఖర్చు చేసి నీట్ కోచింగ్ వెళ్తున్నారన్నారు. ఇలాంటి సందర్భంలో మెడికల్ కళాశాలలు చాలా అవసరమన్నారు. ఇందుకోసం ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ప్రసన్నకుమార్, అశోక్, ఉపాధ్యక్షులు పరమేష్, రామ్మోహన్, కిరణ్, వినోద్, వెంకటేశ్వర్లు, అబ్దుల్లా, రవి తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికులకు రిజర్వేషన్ ఏదీ.?

మద్యం దుకాణాల్లో పది శాతం ఉత్తిదేనా ?

నిరాశలో గీతకార్మికులు

పది శాతం రిజర్వేషన్ ఉత్తిదేనా ?

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం కొత్త మద్యం పాలసీని అమల్లోకి తీసుకురానుంది. ఈ మేరకు ప్రక్రియను మొదలు పెట్టింది. గతంలోనున్న ప్రభుత్వ దుకాణాల స్థానంలో ప్రయివేటుకే అప్పగించేందుకు సిద్ధమైంది. ఈ మేరకు గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వడమే కాకుండా దరఖాస్తులను స్వీకరిస్తోంది. ఈనెల తొమ్మిదవ తేదీతో దరఖాస్తుల స్వీకరణ ముగియనుంది. ఒక్కో దుకాణానికి రెండు లక్షల రూపాయల మొత్తాన్ని చెల్లించి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. అనంతపురం జిల్లాలో 136 దుకాణాలకు టెండర్లు పిలువగా సత్యసాయి జిల్లాలో 87 దుకాణాలకు పిలిచారు. ఈ ప్రక్రియ ప్రస్తుతం నడుస్తోంది. అయితే కొత్త మద్యం పాలసీని అమలు చేస్తామని ప్రకటించిన సమయంలోనే గీత కార్మికులకు పది శాతం రిజర్వేషన్ కల్పిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. అయితే ఆచరణలో ఈ హామీ ఏమైందన్న దానిపై స్పష్టత లేదు. అన్ని మద్యం దుకాణాలకు ఒకే పద్ధతిలో టెండర్లు ఆహ్వానించారు. కల్లు గీత కార్మికులకు న్యాయం చేస్తామని ఎన్నికలకు ముందు చెప్పడమే కాకుండా ఎన్నికల అనంతరం క్యాబినెట్‌లో దీనిపై నిర్ణయం చేశారు. అయితే గెజిట్ నోటిఫికేషన్ విడుదల సమయంలో చూస్తే ఎక్కడా కల్లు గీత కార్మికులకు మద్యం దుకాణాలు రిజర్వు చేసినట్టు కనబరచలేదు. జనరల్ కేటగిరిలోనే దరఖాస్తులు ఆహ్వానించారు. దీంతో కల్లుగీత కార్మికుల్లో ప్రధానంగా ఈడిగ సామాజికవర్గం వారు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ప్రభుత్వం తమకు న్యాయం చేస్తామని ప్రకటించి నోటిఫికేషన్‌లో ఆ అంశమే లేకపోవడంతో చెప్పిన మాట ఏమైందని ప్రశ్నిస్తున్నారు.

అనంతపురం జిల్లాలో సుమారు మూడు వేల మందికిపైగా గీత కార్మికులున్నట్టు అంచనా. అయితే గుర్తింపు కార్డులు మాత్రం 430 మంది వరకు ఇచ్చారు. గీత కార్మిక సహాకార సంఘాలు కూడా జిల్లాలో ఉన్నాయి. ఇవి సుమారు 19 వరకు ఉన్నాయి. సంఘాలు కాకుండా వ్యక్తిగతంగా ఒక్కొక్కరుగానున్న వారూ ఉన్నారు. వీరందరూ ఈ రిజర్వేషన్ వలన మద్యం దుకాణాలు దుక్కుతాయని ఆశలు పెట్టుకుని ఉన్నారు. కల్లుగీత ఇటీవలి కాలంలో తగ్గిపోతోంది. ఈ నేపథ్యంలో మద్యం దుకాణాల ద్వారానైనా లబ్ధిపొందవచ్చునని వారు భావించారు. ప్రతిపక్షంలో ఉండగా హామీనివ్వడమే కాకుండా అధికారంలోకి వచ్చాక కూడా ప్రకటన చేయడంతో ఆ ఆశలు మరింతగా పెరిగాయి. తీరా ఆచరణలో చూస్తే అవేవీ అమలు జరిగే పరిస్థితులు కనిపించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం చెప్పిన ప్రకారం పది శాతమంటే అనంతపురం జిల్లాలో 13 దుకాణాలకుపైగా రిజర్వేషన్ కేటగిరిలో కనబరచి టెండర్లు పిలిచి ఉండాలి. కాని అటువంటిదేది లేకపోవడంతో కల్లుగీత కార్మికుల్లో తీవ్రమైన అసంతృప్తి వ్యక్తమవుతోంది.

పెనుకొండ కొండపై ఆలయ నిర్మాణం చేయాలి

త్రిపుర రిసార్ట్ అధినేత డాక్టర్ గోపీనాథ్

ప్రజాశక్తి-పెనుకొండ

శ్రీకృష్ణదేవరాయలు పాలించిన పెనుకొండ కొండపై వెంకటేశ్వర దేవాలయం నిర్మాణం చేయాలని త్రిపుర రిసార్ట్ అధినేత డాక్టర్ గోపీనాథ్ కోరారు. ఫౌండేషన్ మూడవ వార్షికోత్సవం, మాదిగల ఆత్మీయ కలయిక 9వ వార్షికోత్సవం పట్టణంలోని త్రిపుర రిసార్ట్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ కార్య క్రమానికి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఆర్‌టిఐ కమిషనర్ సునీల్ కుమార్ చావలి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గోపీనాథ్ మాట్లాడుతూ తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామి దేవాలయ నిర్మాణం శ్రీకృష్ణదేవరాయలు చేశారని చరిత్ర చెబుతోందన్నారు. శ్రీకృష్ణదేవరాయలు రెండవ రాజధానిగా ఉన్న పెనుకొండలో శ్రీ వెంకటేశ్వర దేవాలయం నిర్మాణం చేయాలని కోరారు. కొండపై ఇస్కాన్ టెంపుల్ నిర్మాణంతో పాటు వెంకటేశ్వర దేవాలయం నిర్మించాలని ఆయన కోరారు. కొండపై ఆలయ నిర్మాణం వల్ల ఈప్రాంతం పర్యాటకంగా అభివృద్ధి చెందడంతో పాటు కొన్ని వేల మందికి ఉపాధి లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమం అనంతరం ఆత్మీయ కలయిక సంఘ సభ్యులు, ఫౌండేషన్ కమిటీ సభ్యులు గోపినాథ్‌ను ఈ సందర్భంగా నిర్వహించిన ఈ రక్త దాన శిబిరంలో రక్తదాతలకు కమిషనర్ సర్టిఫికెట్లు అందించగా గోపినాథ్ సన్మానించారు. మాదిగల ఆత్మీయ కలయిక ఫౌండేషన్ ‌ప రూ.25వేల విలువైన చెక్‌ను ఫౌండేషన్ అధ్యక్షులు అజిత్ కటికల, సెక్రటరీ, కార్యక్రమ నిర్వాహకులు త్రివిక్రమ్‌కు గోపీనాథ్ అందించారు. ఈ కార్యక్రమంలో జిఎంఆర్‌పి ఎంపిఎల్ సొసైటీ అధ్యక్షులు, ఎంఇఎఫ్ సభ్యులు ఉలవల నాగరాజు, పోతులయ్య, ఆశావాది సుధామకీర్తి, గ్లోబల్ ఇన్‌ఫార్మ్ సతీష్ కుమార్, మారెప్ప , 23 జిల్లాల ప్రతినిధులు, మహిళలు, సభ్యులు పాల్గొన్నారు.

త్రిపుర రిసార్ట్ అధినేత డాక్టర్ గోపీనాథ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

ఆగిన తాగునీటి సరఫరా

మరమ్మతుకు గురైన ప్యానెల్

ప్రజాశక్తి-హిందూపురం

గొల్లపల్లి నుంచి హిందూపురం పురపాలక సంఘానికి అవుతున్న నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడినట్లు మున్సిపల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బాలసుబ్రమణ్యం ఆదివారం తెలిపారు. గొల్లపల్లి నుంచి హిందూపురం వరకు అవుతున్న నీటి సరఫరా లో భాగంగా మూడు ప్రాంతాలలో పంపింగ్ స్టేషన్లు ఉన్నాయన్నారు. ఇందులో ఎస్‌కెడి నగర్ పంపింగ్ స్టేషన్ లో పానెల్ బోర్డు, ట్రాన్స్ ఫార్మర్ మరమ్మతుకు గురి కావడంతో నీటి సరఫరా నిలిచిపోయిందన్నారు. మరమ్మతు పనులు ఇప్పటికే చేపట్టామన్నారు. కలిగిన అసౌకర్యానికి ప్రజలు సహకరించాలని కోరారు.

ఆన్‌లైన్‌లోనూ దరఖాస్తు చేసుకోవచ్చు

ప్రజాశక్తి-హిందూపురం

మద్యం దుకాణాల కోసం దరఖాస్తు చేసుకునే వారు నేరుగా సాధ్యం కాక పోతే ఆన్‌లైన్‌ద్వారా అయి దరఖాస్తు చేసుకోవచ్చని ప్రోహిబిషన్, ఎక్సైజ్ శాఖ డిప్యూటి కమిషనర్ నాగముద్దయ్య చెప్పారు. నూతన మద్యం దుకాణాల కోసం నిర్వహిస్తున్న టెండర్ ప్రక్రియను ప్రోహిబిషన్, ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ నాగముద్దయ్య, అసిస్టెంట్ కమిషనర్ మునిస్వామి, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ నరసింహ, గోవింద్ నాయక్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రోహిబిషన్, ఎక్సైజ్ శాఖ డిప్యూటి కమిషనర్ నాగముద్దయ్య అధికారులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో స్థానిక సిఐ లక్ష్మి దుర్గయ్య, హరికృష్ణ, టిడిఎఫ్, సిఐ, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

సర్వం కల్తీమయం

- కారం నుంచి నెయ్యి వరకూ...
- అడ్డదారి తొక్కుతున్న తయారీదారులు
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం

కాదేదీ కల్తీకి అనర్హం అన్నట్లుగా జిల్లాలో కారం నుంచి నెయ్యి వరకు అన్నీ కల్తీల మయంగా మారుతున్నాయి. వినియోగదారుల ఆరోగ్యాల్ని విస్మరించి తయారీదారులు ఆహారపదార్థాల్లో కల్తీ చేసి సొమ్ము చేసుకుంటున్నారు. నిత్యావసరాలు మొదలుకొని ప్రతి వస్తువులోకి కల్తీలను చేరుస్తున్నారు. నూనె, నెయ్యి. శనగపిండి వంటి వాటితోపాటు చివరికి ధనియాలు, బఠాణీలు వంటి వాటిని కూడా వదలడంలేదు. ఒకరకంగా చెప్పాలంటే కల్తీ కేంద్రాలు కుటీర పరిశ్రమల్లా వెలిశాయి. అరికట్టాల్సిన, అడ్డుకోవాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో నిత్యావసరాలు, నూనెలు, నెయ్యి తదితరాల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ఏది కొనాలన్నా భారంగానే ఉంది. ఇదే అదనుగా కల్తీ వ్యాపారులు విజృంభిస్తున్నారు. పట్టణంలో వంట నూనె వ్యాపారులు నిబంధనలకు తిలోదకాలు పలికారు.కల్తీ వంట నూనె వ్యాపారాలు జోరుగా చేస్తున్నా అధికారులు చోద్యం చూస్తున్నారన్న విమర్శలు వినపడుతున్నాయి. ఇంత వరకు ఒక్కరిపై కూడా చర్యలు తీసుకోక పోవడంపై ఈ విమర్శలకు బలం చేకూర్చుతోంది. గతంలో రష్యా-ఉక్రెయిన్ యుద్ధంతో వంట నూనెల వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించి పాత సరుకు గోదాముల్లో దాచి కొత్త ధరలు ముద్రించి విక్రయించి సొమ్ముచేసుకున్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం లీటరు మంచినూనెపై రూ.15 పెంచింది. లూజ్ విక్రయాలు చేయకుడదన్న నిబంధనలను లెక్క చేయకుండా దర్జాగా లూజ్ విక్రయాలు చేస్తున్నారు.

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలోని నూతన మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ ముందర ఇద్దరు నూనె వ్యాపారులు, పరిగి రోడ్డులో ఉన్నా నూనె వ్యాపారి పెద్ద ఎత్తున గోదాములో వంట నూనె నిల్వ చేసుకుని లూజ్ విక్రయాలు చేస్తున్నారు. ఇందులో మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ వద్ద ఉన్న ఒక వ్యాపారికి ప్యాకింగ్ అనుమతి ఉందని అతనే ప్యాకింగ్ చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ప్యాకింగ్ చేసిన పాకెట్‌లో ఏలాంటి నూనె ఉందో ఎవరికి అర్థం కావడం లేదు. గతంలో అధికారులు తరచూ తనిఖీలు చేస్తుండేవారు. దీంతో ఎక్కడో ఒకదగ్గర మాత్రమే కల్తీలు జరుగుతుండేవి. అయితే ఇప్పుడు తనిఖీలు జరగడంలేదు.. ఒకవేళ ఎవరైనా వచ్చినా వారిని సంతృప్తి పరచి కేసులు లేకుండా చేసుకుంటున్నారన్న విమర్శలున్నాయి. దీంతో కల్తీలు రోజురోజుకు అధికమవుతున్నాయి. కల్తీల దెబ్బకు ఇంట్లో తయారు చేసుకునే పదార్థాల వల్ల ప్రజలు అనారోగ్యం బారినపడే ప్రమాదం ఉంది. పండుగల సమయంలో కల్తీలు తీవ్రంగా జరుగుతున్నాయి. కల్తీలు ఆరోగ్యాలను దెబ్బతీస్తున్నా వ్యాపారులకు ఇది పట్టడంలేదు. పాలు, నెయ్యి, నూనెల కల్తీలతో కేన్సర్ తదితర తీవ్రమైన వ్యాధులు కూడా వస్తున్నాయి. కల్తీ ఆవనూనె వల్ల ఇటీవల ఢిల్లీలో 33 మంది డ్రాప్సీకా అనే కాలేయానికి సంబంధించిన వ్యాధి బారిన పడ్డారు. వంటనూనె, నెయ్యి, కొబ్బరినూనె వంటి వాటిని ప్యాకింగ్, ముద్రణ వివరాలు లేకుండా లేకుండా విక్రయించకూడదని ప్రభుత్వం స్పష్టం చేసింది. వీటి లూజు విక్రయాలను పూర్తిగా నిషేధం విధించింది. అయితే జిల్లాలో మాత్రం లూజు విక్రయాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. పండుగల సమయంలో నెయ్యి, వంటనూనె వాడకం అధికంగా ఉంటుంది. కేజీ నెయ్యి రూ.800 వరకు ఉండటంతో స్వార్థ వ్యాపారుల దృష్టి కల్తీ నెయ్యిపై పడింది. పిండివంటల్లో వాడే బెల్లంలో 90 శాతం కల్తీనే ఉంటుంది. జిల్లాలో కల్తీదారులపై తనిఖీలు, దాడులు చేసేందుకు ఆహారభద్రతా విభాగానికి తగినంత మంది సిబ్బంది లేరు. నిబంధనల ప్రకారం అర్బన్ పరిధిలో ప్రతి 50 వేల మందికి, గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి లక్షమందికి ఒక ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఉండాలి. ఈ లెక్క ప్రకారం జిల్లాకు 50 మందికి పైగా సిబ్బంది ఉండాలి. కానీ ఉమ్మడి జిల్లాలో నలుగురు మాత్రమే ఉన్నారు.

పిండి వంటల్లోనూ కల్తీలు

ప్రస్తుతం ఎక్కువమంది సాంప్రదాయ వంటలను స్వీట్ల దుకాణాల్లో కొనుగోలు చేస్తున్నారు. పిండి వంటల తయారీలో ఎక్కువ శాతం కల్తీనూనె, నెయ్యిలనే వాడుతున్నారు. వీటి విక్రయాలు ఇటీవల అధికమయ్యాయి. వీటి నాణ్యతా ప్రమాణాలను అంచనా వేయడం, అరికట్టడంలో అధికారులకు సమస్యగా మారింది. సవరించిన ఆహార భద్రతా ప్రమాణాల చట్ట ప్రకారం అమ్మకానికి ఉంచిన స్వీట్లపై తయారీ వివరాలను ముద్రించాలి. అయితే జిల్లాలో ఏ ఒక్క వ్యాపారి పిండి వంటలపై వివరాలను ముద్రించడం లేదు.

ఫిర్యాదు చేసే అవకాశం....

సవరించిన చట్ట ప్రకారం స్వీట్లు, పిండివంటలు పాడైతే కూడా ఫిర్యాదు చేయవచ్చు. గతంలో ఇటువంటి నేరాలకు పాల్పడిన వారికి జరిమానాలతో సరిపెట్టేవారు. 2019 సవరించిన చట్టప్రకారం రుచిగా లేని, గడువులోపే పాడైపోయే వాటిని అమ్మితే రూ.5 లక్షల జరిమానా, ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ సవరణలు చేసింది. పదార్థాలు కొనుగోలు చేసినప్పుడు రశీదును తీసుకుంటునే ఫిర్యాదు చేసుకునే అవకాశం ఉంటుంది.

కల్తీ ఇలా....

గోధుమ పిండిలో మైదా, శనగపిండిలో బఠాణీ పిండి కలుపుతున్నారు. పిచ్చికుసుమ గింజలు కలిసిన ఆవనూనెను వంటల్లో వాడుతున్నారు. నెయ్యిలో ఆవు ఎముకల నుంచి తీసిన తేటను కలుపుతున్నారు. బరువు కోసం బంగాళ దుంపలను నీళ్లలో ఉడికిస్తే వచ్చే నీటిని కలుపుతున్నారు. స్వచ్ఛమైన నెయ్యి చలికాలంలో గడ్డకడుతుంది. కానీ మార్కెట్‌లో లభించే నెయ్యిలో ఇటువంటి గుణం కనిపించడం లేదు. కందిపప్పులో శ్రీకాకుళంలో దొరికే కేసరి పప్పు అనే పదార్థాన్ని కలుపుతున్నారు. ఇది తినడం వల్ల నాడీ వ్యవస్థ దెబ్బతినే ప్రమాదం ఉంటుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అరిశెలు, ఇతర స్వీట్లు తయారు సమయంలో వాటి రంగు మరింత అకర్షణీయంగా కనబడటానికి మెటానిల్ అనే కెమికల్‌ను వాడుతుంటారు. ఇవి కలిసిన పదార్థాలను తినడం వల్ల జీర్ణవ్యవస్థ పూర్తిగా దెబ్బతిని క్యాన్సర్ బారిన పడే ప్రమాదం ఉంటుంది.

ఫుడ్‌లైసెన్స్ నెంబర్లను ముద్రించాలి

ఆహార పదార్థాల సంబంధిత వ్యాపారాలు నిర్వహించే వారు ప్రభుత్వ నిబంధనల ప్రకారం బిల్లులు, టాక్స్ ఇన్వాయిస్‌లపై ఫుడ్‌లైసెన్స్ నెంబర్‌ను తప్పని సరిగా ముద్రించాలి. స్వీట్ల తయారీదారులు వాటిపై తయారీ వివరాలను ముద్రించాలి. నిబంధనలు పాటించని వారిపై కేసులతో పాటు రూ.2 లక్షల వరకు జరిమానా విధించే అధికారం సంబందిత అధికారులకు ఉంది. దీంతో లైసెన్స్ లేకుండా వ్యాపారాలు నిర్వహించే వారికి ఆరు నెలల జైలు శిక్షతో పాటు, రూ.5 లక్షల వరకు జరిమానా విధించవచ్చు. ఆహార పదార్థాల తయారీ, విక్రయాల వార్షిక టర్నోవర్‌ను మే 31లోపు ఆన్‌లైన్‌లో ఢిల్లీకు పంపాల్సి ఉంది. అయితే అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల వ్యాపారులు ఇందులో ఒక్క నిబంధన కూడా పాటించడం లేదు.

నూతన మార్కెట్ ఎదురుగా ఉన్నా షాపులో లూజ్ పామాయిల్ విక్రయిస్తున్న దృశ్యం

పండ్ల తోటల పెంపకానికి ప్రోత్సాహం

జిల్లా ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

రైతులను పండ్ల తోటల పెంపకం వైపు మళ్లించేందుకు ప్రభుత్వం రైతులకు ఎన్నో ప్రోత్సాహాలు అందిస్తోందని, ఇటీవల ప్రభుత్వం రైతులకు అందిస్తున్న ప్రోత్సాహకాల వల్ల విరివిగా పండ్ల తోటల పెంపకం సాగిస్తున్నారని, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని శ్రీ సత్యసాయి జిల్లా ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు విషయాలను వెల్లడించారు.

ప్రశ్న : పండ్ల తోటల సాగుతో రైతులకు ఎలాంటి ప్రయోజనాలు ఉన్నాయి?

జవాబు: అతివృష్టి, అనావృష్టి చేత ఇటీవల చాలామంది రైతులు పంటలు సాగు చేయలేక పండ్లతోటల పెంపకం పైన మక్కువ చూపుతున్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మెట్ట భూముల్లో ఉద్యాన పంటలు సాగుకు ఆసక్తి చూపే రైతులు పంట రకాన్ని బట్టి మొక్కలు కొనుగోలు, గుంతలు తీసింది మొదలు పంట దిగుబడి వరకు వివిధ దశల్లో అయ్యే ఖర్చులను మూడు నుంచి రెండేళ్లపాటు ప్రభుత్వం భరించనుంది. ఐదు ఎకరాల లోపు నీటి వసతి ఉన్న రైతుల్లో గతంలో లబ్ధి పొందని వారందరూ ఈ పథకానికి అర్హులు. సాధారణ పంట తోటలతోపాటు గులాబీ ,మల్లె, కొబ్బరి, డ్రాగన్ ఫ్రూట్స్ ,వంటి 18 రకాల పండ్ల మొక్కలు పెంచేలా ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది.

ప్ర : పండ్ల తోటలో పెంపకానికి ప్రభుత్వం నిర్వహణ ఖర్చులు ఇస్తుందా ?

జ: ఎకరా విస్తీర్ణంలో పంట సాగుకు మొక్కలు కొనుగోలు, రవాణా, గుంతలు తీయడం మొక్కలు నాటేందుకు అయ్యే కూలీల ఖర్చులు ఇస్తారు. ఒక్క మొక్క సంరక్షణకు 4.25 రూపాయల చొప్పున వంద మొక్కలకు 425 రూపాయల ప్రకారం నెలకు నాలుగు విడతలు కలిసి మస్టర్ల రూపంలో రూ. 1700 రైతులకు అందిస్తారు. పాదులు తీసి నీరు పెట్టేందుకు మరో రూ. 3500 ఇవ్వనున్నారు. ఇలా మొత్తం రూ.5200 వరకు రైతులు పొందవచ్చు. ఎరువులకు ఆరు నెలలకు ఒకసారి రూ.3వేలు ఇస్తారు. నిర్వహణ ఖర్చుల కింద ఉపాధి పని దినాలను బట్టి మూడేళ్లపాటు ప్రభుత్వం చెల్లిస్తుంది. మామిడికి మొదటి ఏడాది రూ.45,279, రెండవ ఏడాది 29,926 మూడో ఏడాది 27,986 మూడేళ్లకు మొత్తం రూ. 1,03,193 చెల్లిస్తారు. మునగ ,పూల తోటలకు రెండేళ్ళ, మిగిలిన పండ్ల మొక్కలకు మూడేళ్ళ, నిర్వహణ ఖర్చులు చెల్లిస్తారు.

ప్ర : పండ్ల తోటల పెంపకం దారులకు వర్షాకాలం అనుకూలమా ?

జ: వర్షాకాలం పండ్ల మొక్కల పెంపకానికి ఎంతో అనుకూలం. ఇప్పుడు నాటితే వందశాతం మొక్కలు బతుకుతాయి. రైతులకు దాదాపు ఆరు నెలలను నీటిని అందించే శ్రమ ఉండదు. నాటిన ప్రతి మొక్క బతుకుతుంది. మెట్ట భూముల్లో పండ్ల మొక్కల పెంపకానికి ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోంది. మల్లె, గులాబీ ,డ్రాగన్ ఫ్రూట్స్, మునగ మొక్కలు నాటేందుకు అవకాశం ఉంది. ఆసక్తికి ఉన్న రైతులు ఆయా మండలాల్లోని ఉపాధి పథకం ఎపిఒను సంప్రదించి దరఖాస్తు చేసుకోవచ్చు.

ప్ర : పండ్ల తోటల రైతులకు ఏయే పంటలకు ఎంత నష్టపరిహారం అందిస్తారు?

జ: సత్య సాయి జిల్లా వ్యాప్తంగా 2022 -23 సంవత్సరంలో కురిసిన వర్షాలకు 25 ఎకరాలలో పండ్ల తోటలకు నష్టం వాటిల్లింది. 316 మంది రైతులకు పంట నష్టం జరిగింది. అత్యధికంగా కాయగూరల పంటలైన టమోటాకు భారీ నష్టం వాటిల్లింది. జిల్లావ్యాప్తంగా 110 ఎకరాల్లో టమోటా పంట నాశనమైంది. నష్టపరిహారం బొప్పాయికి ఎకరాకు రూ.15వేలు, అరటికి రూ. 25 వేలు, మామిడికి ఎకరాకు రూ. 20వేలు కొత్తిమీర పంటకు రూ.7,200ల నష్టపరిహారం రైతులకు అందిస్తాం.

ప్ర : గత నాలుగు సంవత్సరాల నుండి నష్టపోయిన రైతులకు ఏ విధంగా ఆదుకుంటున్నారు?

జ: పంట నష్టాన్ని అంచనా వేసి నివేదికలు ప్రతి సంవత్సరం ప్రభుత్వానికి అందిస్తున్నాం. గత ఐదు సంవత్సరాల నుండి ఉద్యాన పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందిస్తున్నాం. క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలించి నివేదికలను ప్రతి సంవత్సరం అందజేస్తున్నాం. వీటికి తోడు సబ్సిడీ ధరలకు స్ప్రింకర్లు, స్ప్రేయర్లు, పైపులు, డ్రమ్ములు, పాథలిన్ పట్టలు, రైతులకు సబ్సిడీతో అందిస్తున్నాం.

కారు బోల్తా.. ఇద్దరు మృతి

ఐదుగురికి గాయాలు

ప్రజాశక్తి - లేపాక్షి

మండల పరిధిలోని చోళసముద్రం గ్రామం వద్ద మడకశిర వైపు నుండి లేపాక్షి వైపు వస్తున్న కారు బోల్తా పడిన ప్రమాదంలో ఇద్దరు మృతిచెందారు. మరో ఐదుగురు గాయపడ్డారు. ఆదివారం జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు.. లేపాక్షి గ్రామానికి చెందిన వ్యక్తి కారులో ఏడుగురు మడకశిర వైపు నుంచి లేపాక్షికి వస్తున్నారు. చోళసముద్రం గ్రామం మలుపు వద్ద జాతీయ రోడ్డులో మీద అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న బాసలమనేపల్లికి చెందిన సరస్వతమ్మ, చిలమత్తూరు మండలం లోని చాణగానిపల్లికి చెందిన నారాయణమ్మ, లేపాక్షికి చెందిన సరస్వతి, అంజనప్ప, బిసలమనేపల్లికి చెందిన నారాయణమ్మ, లక్ష్మిదేవి, నాగిరిరేగి గ్రామానికి చెందిన రాజేశ్వరి గాయపడ్డారు. వీరిలో బాసలమనేపల్లికి చెందిన సరస్వతమ్మ (57), చిలమత్తూరు మండలం చాణగానిపల్లికి చెందిన నారాయణమ్మ (65) తీవ్రంగా గాయపడటంతో హిందూపురం ఆసుపత్రికి తరలిస్తున్న సమయంలో మార్గమధ్యలో మృతిచెందారు. మిగిలిన వారు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్ఐ సర్ఫుద్దీన్ తెలిపారు.

ప్రమాదంలో గాయపడిన వారు

ప్రమాదంలో దెబ్బతిన్న కారు

రైతులకు విద్యుత్ కష్టాలు రానివ్వం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-చెన్నేకొత్తపల్లి

వ్యవసాయానికి సంబంధించి రైతులకు ఎలాంటి విద్యుత్ కష్టాలు రాకుండా చూడాల్సిన బాధ్యత ఆ శాఖ అధికారులపై ఉందని ఎమ్మెల్యే పరిటాల సునీత తెలిపారు. చాలా రోజులుగా ట్రాన్స్‌ఫార్మర్ల కోసం నిరీక్షిస్తున్న రైతుల కోసం ఎమ్మెల్యే సునీత చొరవతో చెన్నేకొత్తపల్లి మండలానికి 33, కనగానపల్లి మండలానికి 27 ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరయ్యాయి. వీటిని ఆదివారం ఎమ్మెల్యే పరిటాల సునీత పంపిణీ చేశారు. ఆయా మండల కేంద్రాల్లో జరిగిన కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ట్రాన్స్‌ఫార్మర్ల కోసం రైతులు ఏళ్ల తరబడి విద్యుత్ కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండేదన్నారు. కేవలం వైసిపి సానుభూతి పరులకు మాత్రమే ట్రాన్స్‌ఫార్మర్లు వచ్చేలా అప్పటి నాయకులు ఒత్తిడి తెచ్చారన్నారు. కానీ టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీలు చూడకుండా ముందు ఎవరు దరఖాస్తు చేసుకుంటే వారికి ట్రాన్స్‌ఫార్మర్లు ఇవ్వాలని విద్యుత్ శాఖ అధికారులకు ఆదేశాలిచ్చామన్నారు. ఈ ప్రభుత్వం వచ్చాకనే పెండింగ్‌లో ఉన్న వారికి ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేయించినట్లు వెల్లడించారు. కరువు ప్రాంతమైన అనంతలో రైతులు వ్యయప్రయాసలకోర్చి పంటలు సాగుచేస్తుంటారని ఇలాంటి పరిస్థితుల్లో విద్యుత్ సమస్యలతో పంటలు ఎండిపోవడం సరికాదన్నారు. రైతులు సమస్య తెలియజేసిన వెంటనే పరిష్కరించాలన్నారు. ఇంకా విద్యుత్ పరికరాలు అవసరమైతే వాటిని సకాలంలో అందించాలన్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరు ప్రక్రియను క్రమసంఖ్య ఆధారంగా చేపట్టాలన్నారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా నివారించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. పార్టీల పక్షపాతం లేకుండా రైతులందరికీ విద్యుత్ శాఖ అధికారులు పని చేయాలని పరిటాల సునీత సూచించారు.

రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సునీత

చీనీ చెట్ల నరికివేత బాధాకరం : చిలకం

ప్రజాశక్తి-బత్తలపల్లి

రాజకీయ ముసుగులో రైతులను నష్టపరచడానికి, ఆర్థికంగా దెబ్బతీయడానికి చీనీ చెట్లు నరికివేయడం విచారకరమని జనసేనపార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని తంబాపురం గ్రామంలో జనసేన పార్టీ కార్యకర్త రమణారెడ్డి సాగు చేస్తున్న 53 చీనీ చెట్లను శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నరికి వేసిన విషయం తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న చిలకం ఆదివారం తంబాపురం గ్రామం వెళ్లి బాధిత రైతు రమణారెడ్డిని పరామర్శించారు. పొలంలో నరికివేతకు గురైన చీనీచెట్లను పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడు తూ చెట్లను నరికివేసే విష సంస్కృతి మంచిది కాదన్నారు. రమణారెడ్డి మూడేళ్లుగా ఎంతో కష్టంతో చీనీ చెట్లను సాగు చేస్తున్నాడని, వాటిని నరకడానికి చేతులు ఎలా వచ్చాయోనని మండిపడ్డారు. దీనికి కారకులైన వారు ఎంతటి వారైనా వదిలే ప్రసక్తే లేదన్నారు. దుండగులను పోలీసులు త్వరగా పట్టు కొని చట్టబద్ధంగా శిక్షించాలని కోరారు. ఇదే విషయమై ఎస్ఐ పి.శ్రీనివాసులు, సిఐ ప్రభాకర్, జిల్లా ఎస్పీతో చర్చించానని బాధిత రైతులకు పార్టీ తరపున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట బిజెపి మండల కన్వీనర్ ఆకులేటి వీరనారప్ప, జనసేన మండల కన్వీనర్ పురంశెట్టి రవి, బెస్త శ్రీనివాసులు, రఘు, ప్రకాష్, ప్యాదిండి వెంకటేష్, కడపల సుధాకర్‌రెడ్డి, పొటికి రామంజి, అఖిల్, పేరూరు శ్రీనివాసులు, పూలమండి వెంకటస్వామి, సంజీవరెడ్డి, ఎర్రిస్వామిరెడ్డి, శివారెడ్డి, దాడితోట కృష్ణ, రాజారెడ్డి, ముసుగు రామచంద్ర, తదితరులు ఉన్నారు.

వివాదాస్పద భూమిపై ఆర్డీవో విచారణ

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండల కేంద్రమైన సోమందేపల్లిలోని వివాదాస్పద భూమికి సంబంధించి ఆదివారం పెనుకొండ ఆర్డీవో ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. అక్కమ్మ కొండ సమీపంలో సగర ఉప్పర కులస్తులు సర్వే నెంబర్ 782-2లోని 60 సెంట్ల భూమిని ఇతరుల నుంచి కొనుగోలు చేసి అక్కడ వారి కులానికి సంబంధించిన భవన నిర్మాణం చేపట్టేందుకు రెండు నెలలుగా చదును చేశారు. అయితే ఆదివారం గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు ఈ భూమి తమదని అడ్డుకున్నారు. దీనిపై కొందరు పోలీస్ స్టేషన్లో కూడా ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై గ్రామంలో శాంతి భద్రతల నేపథ్యంలో పెనుకొండ డీఎస్పీ వెంకటేశ్వర్లు, పెనుకొండ సిఐ రాఘవన్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్ఐ రమేష్‌బాబు, ఎఎస్ఐ మురళి, సోమందేపల్లి పోలీసులు బందోబస్తుప ఏర్పాటు చేశారు. సాయంత్రం రెవెన్యూ యంత్రాంగం సర్వేయర్ ఆధ్వర్యంలో ఉప్పర కులస్తులకు ఉన్న డాక్యుమెంట్ మేరకు సర్వే కొలతలు చేపట్టామని, భూమి వివాదాస్పదం కాకుండా డాక్యుమెంట్ మేరకు వారికి వచ్చేలా చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా సోమవారం ఎంపి పార్థసారథి ఆధ్వర్యంలో ఉప్పర కులస్తులు భవన నిర్మాణ భూమిపూజ కార్యక్రమానికి ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో భూమిపూజ కార్యక్రమాన్ని రద్దు చేశామని, పూర్తి విచారణ అనంతరం ఎలాంటి కార్యక్రమాలకైనా అనుమతి ఇస్తామని అధికారులు తెలిపారు.

వివాదాస్పద భూమిపై విచారణ చేస్తున్న ఆర్డీవో

చంద్రబాబు స్ఫూర్తితో బాధితులకు చేయూత : పల్లె

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

ప్రజలను ఆదుకోవడంలో సిఎం చంద్రబాబే స్ఫూర్తి అని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి తెలి పారు. ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీమంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి పిలుపుమేరకు నియోజకవర్గ ప్రజలు అందించిన నగదుతో పాటు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ఇచ్చిన రూ. 25లక్షల నగదుతో పాటు రూ. 43 లక్షల విలువ చేసే 71 టన్నుల ఆహార ధాన్యాలను విజయవాడ వరద బాధితుల సహాయార్థం 6 వాహనాల్లో తరలించారు. ఈ వాహనాల ను ఆదివారం పుట్టపర్తి సత్యమ్మ గుడి వద్ద పల్లె రఘునాథ్‌రెడ్డి, టిడిపి నాయకులు జెండా ఊపి ప్రారంభించారు. పల్లె మాట్లాడుతూ వరద బాధితులను ఆదుకునేందుకు ముందుకొచ్చిన నియోజకవర్గ టిడిపి శ్రేణులు, అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బోయ రామాంజనేయులు, రత్నప్పచౌదరి, శ్రీరామిరెడ్డి, సామ కోటి ఆదినారాయణ, బేకరీ నాయుడు, గంగిరెడ్డి, శ్రీరాములు, బిజెపి నాయకులు జ్యోతిప్రసాద్, లాయర్ హరికృష్ణ పాల్గొన్నారు.

జెండా ఊపి వాహనాలను ప్రారంభిస్తున్న టిడిపి శ్రేణులు

టిడిపి కార్యకర్తలకు పల్లె పరామర్శ

పుట్టపర్తి రూరల్ : మండలంలోని కంబాలపర్తి గ్రామంలో శనివారం రాత్రి వైసిపి, టిడిపి వర్గాల మధ్య చోటు చేసుకున్న ఘర్షణలో టిడిపి కార్యకర్తలు వెంకటరాముడు, నరసింహులుకు తీవ్రగాయాలయ్యాయి. వారు అనంతపురం జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా ఆదివారం మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి ఆసుపత్రికి వెళ్లి వారిని పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు.

యువత క్రీడల్లో రాణించాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కదిరి టౌన్

బంగారు భవిష్యత్తు కోసం యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ సూచించారు. పట్టణంలోని ఎస్‌టిఎస్ఎన్ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన జిల్లా సీనియర్ ఫుట్‌బాల్ టీం కోచింగ్ క్యాంప్‌ను ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో యువత తీవ్ర ఒత్తిడికి లోనవుతుందన్నారు. మానసికంగా ఒత్తిడిని అధిగమించాలంటే చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే శారీరక దృఢత్వం కూడా పెంపొందుంతుందని తెలిపారు. కార్యక్రమంలో కోచ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులతో ఎమ్మెల్యే కందికుంట

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

మండలంలోని తంగేడుకుంట జడ్పీ హైస్కూల్‌లో 2006-07 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ఆదివారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి విశ్రాంత ఎంఇఒ జయచంద్రఆరెడ్డి, విశ్రాంత హెచ్ఎం చెన్నారెడ్డి హాజరై పూర్వ విద్యార్థులను ఉద్దేశించి సందేశం ఇచ్చారు. అనంతరం ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు పూలమాలలు, దుశ్శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత రాధమ్మ, ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, జనార్ధన, రవికుమార్, రమేష్, మధు, కరుణాకర్‌రెడ్డి, ప్రమీల, కౌశిక్, వెంకటరమణ, మురళి, నరసింహయ్య, అశ్విని, గుణవతి, నాగమణి, అశ్విని, వసుంధర, రేవతి, వనజ, ద్రాక్షాయిని, తదితరులు పాల్గొన్నారు.

సమావేశమైన పూర్వ విద్యార్థులు

కదిరి నుంచి శ్రీశైలానికి బస్సు సర్వీస్

ప్రజాశక్తి-కదిరి టౌన్

కదిరి నుంచి శ్రీశైలం పుణ్యక్షేత్రానికి త్వరలో రాత్రిపూట బస్సు సర్వీస్‌ను పునరుద్ధరిస్తామని జిల్లా ప్రజా రవాణా అధికారి మధుసూదన్ తెలిపారు. ఆయన ఆదివారం కదిరి డిపోను సందర్శించి బస్టాండ్‌లో ప్రయాణికులకు అవసరమైన తాగునీరు, కుర్చీలు, బల్లలు, ఫ్యాన్లు, తదితర సౌకర్యాలను పరిశీలించారు. అదనంగా కుర్చీలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. కదిరి డిపో నుంచి పుట్టపర్తి, ధర్మవరం డిపోలో రిలీవ్ డ్యూటీపై పని చేస్తున్న సిబ్బందిని వెంటనే కదిరి డిపోకు పంపించాలని యూనియన్ నాయకులు కోరగా త్వరలో వారిని కదిరి డిపోకు పంపిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఆయనతో పాటు ఎన్ఎంయు నాయకులు ఎన్‌వి.రమణ, హరి మోహన్, బైరిశెట్టి, రామచంద్ర, సురేంద్ర, కార్గో సూపర్వైజర్ శ్రీనివాసులు, ఇన్‌ఛార్జి డిపో మేనేజర్ హరిత, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగసుబ్బయ్య ఉన్నారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

మండలంలోని జగరాజుపల్లి ఆదర్శ పాఠశాల విద్యార్థులు అండర్-14 హ్యాండ్‌బాల్ పోటీల్లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎస్‌జిఎఫ్ ఆధ్వర్యంలో అనంతపురం నగరంలోని జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచడంతో రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికయ్యారు. వీరు గుంటూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. రాష్ట్రస్థాయి పోటీలకు బ్రాహ్మణపల్లికి చెందిన ఓంశ్రీ, పుట్టపర్తి ఫర్హాన్ ఎంపికయ్యారు. వీరి ఎంపిక పట్ల ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ రమేష్‌బాబు, ఉపాధ్యాయ బృందం, పిడిఇ అజీమ్‌బాషా హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రస్థాయిలో సైతం ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపిక కావాలని వారు ఆకాంక్షించారు.

ధర్మవరం మున్సిపల్ కమిషనర్ బదిలీ

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

ధర్మవరం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున ప్రొద్దుటూరు మున్సిపాలిటీకి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో జమ్మలమడుగు ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా పని చేస్తున్న ప్రమోద్‌కుమార్ ధర్మవరం మున్సిపాలిటీ కమిషనర్‌గా ప్రభుత్వం బదిలీ చేసిందని మున్సిపల్ అధికారులు తెలిపారు.

ప్రధాన రహదారిలో గుంతలు పూడ్చిస్తున్న సిఐ రాజ్‌కుమార్

సిఐ చొరవతో రోడ్డుపై గుంతలు పూడ్చివేత

ప్రజాశక్తి-మడకశిర

పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్, పెనుకొండ రోడ్డులో ప్రధాన రహదారిపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడడంతో పాదచారులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ముఖ్యంగా వాహనదా రులకు ప్రయాణం నరకప్రాయంగా మారింది. వాహనదారులు పలుమార్లు ప్రమాదాలకు గురయ్యారు. దీంతో రూరల్ సిఐ రాజ్‌కుమార్ చొరవ తీసుకుని ఆదివారం పట్టణంలోని కాంట్రాక్టర్‌తో కలిసి ట్రాక్టర్ల ద్వారా జెల్లీ సిమెంట్‌ను తెప్పించి గుంతలను పూడ్చి వేయించారు. సిఐ రాజకుమార్ చొరవ పట్ల పట్టణ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పురం టూటౌన్ ఎస్ఐగా అబ్దుల్ కలాం ఆజాద్

హిందూపురం : పట్టణంలోని టూ టౌన్ ఎస్ఐగా అబ్దుల్ కలాం ఆజాద్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సిఐ అబ్దుల్ కరీంను మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతు పట్టణ వ్యాప్తంగా శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు.

ప్రమాదపుటంచుల్లో విద్యుత్ స్తంభం

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

పట్టణంలోని సత్యసాయినగర్ నుంచి రేగాటిపల్లి వెళ్లే రోడ్డులో ఉన్న వివేకానంద కాలేజీకి వెళ్లే మార్గంలో ఓ విద్యుత్ స్తంభం పక్కకి ఒరిగి పోయి ప్రమాదపుటంచుల్లో ఉంది. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో ఈ విద్యుత్ స్తంభం ఎప్పుడు కూలుతుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ దారిలో నిత్యం వాహనాలు, విద్యార్థులు రాకపోకలు సాగిస్తూ ఉంటారు. ఏదైనా ప్రమాదం జరగకముందే విద్యుత్ అధికారులు స్పందించి స్తంభాన్ని మార్చాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రశాంత జీవనం గడపండి : పల్లె

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

జీవితకాలంలో మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే ధ్యానం తప్పనిసరిగా చేయాలని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి సూచించారు. పట్టణంలోని వాసవీ నివాస్‌లో ఆదివారం ఆర్యవైశ్యుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బ్రాండ్ అంబాసిడర్ మీటింగ్-8 ధ్యాన మందిరంలో మాజీ మంత్రి పల్లె పాల్గొని మాట్లాడారు. మానసికంగా ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి మనిషి తప్పనిసరిగా ధ్యానం ఆచరించాల న్నారు. మనిషి జీవితంలో ఎన్నో ఒత్తిళ్లకు గురవుతూ ప్రశాంతత లేని జీవితం గడుపుతు న్నారని, దీనికి పరిష్కార మార్గం ధ్యానమే అని సూచించారు. ప్రతి ఒక్కరూ మంచి శాఖాహార భోజనం తీసుకోవాలని, కష్టపడేతత్వం అలవర్చుకోవాలన్నారు. అనంతరం ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీ నివాస్ ద్వారా పేద విద్యార్థులకు ఉచిత విద్య అందజేస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బందికి పల్లె రఘునాథ్ రెడ్డి, ఆర్య వైశ్య సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శిద్దా నాగేశ్వర్‌రావు, కోటా సత్యం, హనుమంతరావు, బాలకృష్ణ, ప్రవీణ్ ద్వారా దుస్తులు అందజేశారు. అలాగే పల్లె రఘునాథ్‌రెడ్డిని పుట్టపర్తి ఆర్యవైశ్య సంఘం నాయకులు శాలువా కప్పి మెమెంటో అందజేసి సత్కరించారు.

'లడ్డూ' వ్యవహారంలో సుప్రీంకోర్టు తీర్పుతో జగన్‌లో వణుకు

కొత్తచెరువు : తిరుమల లడ్డూ ప్రసాదం కల్తీ వ్యవహారంపై సుప్రీంకోర్టు తీర్పుతో వైసిపి అధినేత, మాజీ సిఎం జగన్ వెన్నులో వణుకు మొదలైందని మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం మండలంలోని తలమర్ల గ్రామ సర్పంచి కమ్మన్న కుమార్తె తేజశ్విని, రాజేష్ నిశ్చితార్థ వేడుకలకు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంలో సుప్రీంకోర్టు తీసుకున్న చారిత్రాత్మకమైన నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. సుప్రీంకోర్టు స్వతంత్ర సంస్థ ఏర్పాటు చేసి విచారణకు ఆదేశించడంతో వైఎస్.జగన్మోహన్‌రెడ్డి వెన్నులో వణుకు మొదలైందన్నారు. అతి త్వరలో నిజాలు బహిర్గతం కావడం ఖాయమన్నారు. అందులో పాత్రధారులందరికీ తగిన శిక్ష పడుతుందన్నారు. వైసిపి పాలనలో అన్ని వ్యవస్థలను భ్రష్టు పట్టించారని విమర్శించారు. పరిపాలన చేతకాని జగన్ తీరు వల్ల రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధిలో వెనుకబడిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెడుతుందన్నారు.

పల్లె రఘునాథ్‌రెడ్డిని సత్కరిస్తున్న కోటా సత్యం, తదితరులు

ఇకపై ఇసుక బుకింగ్ సులభతరం : కలెక్టర్

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

నూతన ఇసుక పాలసీ ప్రకారం ఇకపై ఇసుకను ఉచితంగా, సులభంగా బుక్ చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం శాండ్ బుకింగ్ పోర్టల్‌ను అమలులోకి తీసుకొచ్చిందని, ఈ సదుపాయాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ టిఎస్.చేతన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. నూతన ఇసుక పాలసీ ప్రకారం ఉచితంగా ఇసుకను పొందేందుకు రాష్ట్ర గనులు, భూగర్భ శాఖ వారు ప్రత్యేకంగా రూపొందించిన ఎపి శాండ్ పోర్టల్ (https:// www.sand. ap.gov.in)లో వర్చువల్ విధానం ద్వారా ఇసుక కావాల్సిన వినియోగదారులు బుక్ చేసుకోవచ్చు అన్నారు. ప్రస్తుతం సిసి రేవు వద్ద 49,240 మెట్రిక్ టన్నులు, పీసీ రేవు వద్ద 46,729 మెట్రిక్ టన్నుల ఇసుక సరఫరాకు అనుమతి ఉందన్నారు. పూర్తి పారదర్శకత, జవాబుదారీ తనంతో ఉచిత ఇసుక పంపిణీ జరుగుతుందన్నారు. ఉచిత ఇసుక పంపిణీ విధానం అమలులో దరఖాస్తుదరుడు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. గ్రామ/వార్డ్ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని లేదా వ్యక్తిగతంగా కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

కదిరి బస్టాండ్‌లో గుర్తుతెలియని శిశువు

ప్రజాశక్తి-కదిరి టౌన్

కదిరి ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆదివారం గుర్తు తెలియని మహిళ బాత్ రూమ్ వెళ్లివస్తానని చెప్పి 5 నెలలు శిశువుని మరో మహిళకు అప్పచెప్పి తిరిగి రాకుండా వెళ్లిపోయింది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు.. డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వడంతో పోలీసులు బస్టాండ్‌కు వెళ్లి ఆ పాపను వదిలివెళ్లిన మహిళ కోసం చుట్టుపక్కల గాలించారు. మహిళ ఆచూకీ తెలియకపోడంతో పోలీసులు ఆ పాపను పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి వదిలి వెళ్లిన మహిళపై సుమోటో కేసు నమోదు చేశారు. శిశువును శ్రీశిశు సంక్షేమ శాఖ అధికారులకు అప్పగించారు. సోమవారం సిడబ్ల్యుసి వారి వద్ద పాపను హాజరు పెట్టి వారి ఉత్తర్వుల మేరకు శిశు విహార్‌లో అప్పగిస్తామన్నారు. పాప గురించి తెలిసిస్తే టౌన్ సిఐ నెంబర్ : 9440796851కి సమాచారం ఇవ్వాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

పోలీసుల సమక్షంలో ఉన్న వదిలి వెళ్లిన చిన్నారి

గ్రామాల్లో ఆత్మగౌరవ జెండా ఎగురవేద్దాం

ప్రజాశక్తి-కదిరి టౌన్

ప్రతి గ్రామంలో మాదిగల ఆత్మగౌరవ జెండాను ఎగుర వేద్దామని ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షులు గూనివాండ్ల నాగేంద్రనాథ్ పిలుపునిచ్చారు. పట్టణంలోని ఎన్‌జివో హోంలో ఆదివారం నాగేంద్రనాథ్ అధ్యక్షతన అత్యవసర సమావేశం నిర్వహించగా ముఖ్యఅతిథిగా ఎంఈఎఫ్ జాతీయ నాయకులు ఆనంద్ పాల్గొన్నారు. నాగేంద్రనాథ్ మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ సూచన మేరకు వర్గీకరణపై జరుగుతున్న కుట్రలను ప్రతి ఒక్కరూ తిప్పి కొట్టాలన్నారు. మాదిగ ఉద్యోగులు, మేధావులు ప్రతి పల్లెకు వెళ్లి వర్గీకరణ అంశాన్ని, దాని ఫలితాలను ప్రతి ఒక్కరికీ వివరించాలని కోరారు. సమావేశంలో ఎంఈఎఫ్ నాయకులు కె.శ్రీనివాసులు, చిన్నప్పయ్య, నాగప్ప, వేమనారాయణ, కిష్టప్ప, శివనాథ్, ఆంజనేయులు, రామకృష్ణ, పుల్లన్న, ఆదినారాయణ, ఎమ్మార్పీఎస్ నాయకులు విశ్వనాథ్, నాగరాజు, నరసింహులు, నాయకులు గంగాద్రి, గంగరాజు, మున్సిపల్ కార్మికులు తిరుపాల్, సూరి, రాజు, భార్గవ్, మురళి, కిరణ్ పాల్గొన్నారు.

ఆర్‌టిసి ఉద్యోగులపై పని భారం తగ్గించాలి

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పనిభారం తగ్గించాలని కోరుతూ స్థానిక ఆర్‌టిసి డిపోలో పని చేస్తున్న ఉద్యోగులు ఆదివారం నల్ల బ్యాడ్జిలతో విధులకు హాజరయ్యారు, వివరాలు.. అన్ని డిపోల్లో కంటే ధర్మవరం డిపోలో ఉద్యోగుల పై పని భారం పెరిగిపోయిందని ఈ విషయాన్ని పలుమార్లు ఎపి పబ్లిక్ రవాణా శాఖ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో డిపో మేనేజర్ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. ఇకనైనా సమస్యను పక్షంలో నిరవధిక ఆందోళనలు చేస్తామని డిఎంకి తెలిపారు. రీజినల్ కమిటీ పిలుపు మేరకు ఆదివారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కెబి.నాగార్జునరెడ్డి, కమిటీ సభ్యులు నరసింహులు, డిపో కార్యదర్శి జె.ముస్తఫా, కమిటీ సభ్యులు బాబు, తిరుమలేష్, రామకృష్ణ పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరైన ఆర్టీసీ ఉద్యోగులు

సిసి రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండలం బీరేపల్లి, మలగూరు గ్రామాల్లో సిసి రోడ్డు నిర్మాణ పనులను ఆదివారం ప్రారంభించారు. ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకులు డాక్టర్ సురేంద్ర భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. జాతీయ గ్రామీణ అభివృద్ధి నిధుల నుంచి ఒక గ్రామానికి రూ.40 లక్షల చొప్పున రూ. 80లక్షలతో పనులను ప్రారంభించినట్లు నాయకులు చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ ఆశ్వర్థ నారాయణ రెడ్డి, బేవినహళ్లి ఆనంద్, మాజీ సర్పంచులు, ఎంపిటీసిలు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

భూమి పూజ చేసి పనులను ప్రారంభిస్తున్న నాయకులు

ప్రెస్‌క్లబ్ అభివృద్ధికి సహకారం అభినందనీయం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలోని ప్రెస్ క్లబ్ అభివృద్ధికి పూలకుంటలోని అక్షరమాల స్కూల్, సత్యం కోచింగ్ సెంటర్ నిర్వాకులు శ్రీనివాసులు సహకరించడం అభినందనీయమని సీనియర్ పాత్రికేయులు అన్నారు. ప్రెస్ క్లబ్ ఆధునీకరణ పనుల్లో భాగంగా శ్రీనివాసులు తన వంతుగా సుమారు రూ. 1.30లక్షలతో పలు అభివృద్ధి పనులు చేయించారు. ఈ నేపథ్యంలో పాత్రికేయులు శ్రీనివాసులు దంపతులను స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం సన్మానించారు. అనంతరం ప్రెస్ క్లబ్ ఆవరణంలో తబీబా మొక్కను నాటారు.ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు రామాంజినేయులు, కార్యదర్శి ప్రశాంత్, సీనియర్ పాత్రికేయులు రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసులు దంపతులను సన్మానిస్తున్న పాత్రికేయులు

అగళిలో వారపుసంత ప్రారంభం

ప్రజాశక్తి-అగళి

మండల కేంద్రమైన అగళిలో ఆదివారం ఎట్టకేలకు వారపు సంత ప్రారంభమైంది. ఈ సంతను గత రెండేళ్లుగా నిర్వహించేవారు కాదు. దీంతో ప్రజలు కూరగాయలు కొనేందుకు తీవ్ర ఇబ్బందులు పడేవారు. గత 20 ఏళ్లకు పైగా కూరగాయల సంతతో పాటు మూగజీవాల సంత నిర్వహించేవారు. అయితే కరోనా సమయంలో సంత నిర్వహణను నిలిపి వేశారు. అప్పటి నుంచి ఇప్పటివరకూ సంత నిర్వహించకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. రైతులు, ప్రజలను దృష్టిలో పెట్టుకొని మండల నాయకులు ఎట్టకేలకు ఆదివారం ఇక్కడ కూరగాయల సంతను ప్రారంభించారు. ప్రతి ఆదివారం ఈ సంతలో కూరగాయలు, గొర్రెలు, మేకలు, ఆవులు, ఎద్దులు, ఎనుముల క్రయ విక్రయాలు నిర్వహిస్తామని జడ్పిటిసి ఉమేష్ తెలిపారు.

వడ్డే ఓబన్న విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

వడ్డే ఓబన్నకు నివాళి

కొత్తచెరువు : స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న వర్ధంతి సందర్భంగా ఆదివారం వడ్డెర సంఘం ఆధ్వర్యంలో స్థానిక పుట్టపర్తి రోడ్డులో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘం నాయకులు మాట్లాడుతూ వడ్డే ఓబన్న దేశ స్వాతంత్రం కోసం బ్రిటీషు వారితో పోరాడిన మహనీయుడు అన్నారు. ప్రతి ఒక్కరూ ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వడ్డెర సంఘం నాయకులు ఒలిపి శ్రీనివాసులు, నారాయణ, ఎంవి.పాపన్న, పూజారి పెద్దన్న, నల్లమాడ శంకర్, తిరుపతేంద్ర, ఆదినారాయణ, నారాయణస్వామి, ముత్యాలు పాల్గొన్నారు.

కరాటేలో బెల్టులు అందుకున్న విద్యార్థులు

కరాటేతో ఆత్మరక్షణ

ధర్మవరం రూరల్ : పట్టణంలోని కొత్తపేట మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం కరాటే మాస్టర్ ఇనాయత్ బాషా మల్టీ స్టార్ బుడోకాన్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో బెల్ట్ గ్రేడింగ్ పరీక్ష నిర్వహిం చారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన మాంగళ్య సిల్క్స్ అధినేత జింకా పురుషోత్తంతో పాటు ఆదిత్య స్కూల్ కరెస్పాండంట్ పి.జనార్దన్, కదిరికి చెందిన సీనియర్ కరాటే మాస్టర్ అక్బర్ అలీ విద్యార్థులకు బెల్టులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న అఘాయిత్యాలను ఎదుర్కోవాలంటే ప్రతి ఒక్కరూ కరాటే నేర్చుకోవాలన్నారు. తద్వారా వారికి వారే రక్షించుకునేలా శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం కలుగుతాయని విద్యార్థులకు తెలిపారు.

అన్నదానం చేస్తున్న ఆంజనేయులు

వైద్య శిబిరంలో అన్నదానం

ఓబుళదేవరచెరువు: మండలంలోని కొండకమర్లలో ఆదివారం సత్యసాయి బాబా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆరోగ్య వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి హాజరైన ప్రజలకు ఆంజనేయులు ఉచితంగా అన్నదానం ఏర్పాటు చేశారు. ఆంజనేయులు మాట్లాడుతూ ప్రతి నెలా 6వ తేదీ సత్య సాయిబాబా ట్రస్ట్ ఆధ్వర్యంలో కొండకమర్లలో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహిస్తారని, శిబిరానికి వచ్చే సుమారు 200 మందికి అన్నదానం ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

శ్రీరామిరెడ్డికి ఘన నివాళి

ప్రజాశక్తి-మడకశిర రూరల్

మండలంలోని నీలకంఠాపురం గ్రామంలో ఆదివారం స్వాతంత్ర్య సమరయోధులు, మాజీ రాజ్యసభ సభ్యులు శ్రీరామిరెడ్డి 119వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా శ్రీరామిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీరామిరెడ్డి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌లో విజయం సాధించిన బుల్లసముద్రం గ్రామంలోని సూర్య విద్యానికేతన్ విద్యార్థులకు జ్ఞాపికను సత్యవతి ఐఎఎస్, సిడబ్ల్యుసి మెంబర్ రఘువీరారెడ్డి షీల్డ్ అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్ గంగలవాయి ప్రభాకర్‌రెడ్డి, మందలపల్లి నాగరాజు, సూర్య విద్యానికేతన్ కరస్పాండెంట్ మల్లికార్జునరెడ్డి, తదితరులు ఉన్నారు

క్రికెట్‌ట్రోఫీతో బుల్లసముద్రంజట్టు